క్లుప్తంగా

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



వేళంగిలో ట్యాంకర్‌తో సరఫరా చేస్తున్న నీరు

కరప: వేసవిలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నట్టు ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతానికి వేళంగి గ్రామంలోని శివారు ప్రాంతాలు, కరప శివారు పేపకాయలపాలెంలో పూర్తిస్థాయిలో మంచినీటి ట్యాంకులు నిండకపోవడంతో ఆయా ప్రాంతాల్లో తాగునీరు సరఫరా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించి తాగునీటి సరఫరాను పరిశీలించారు. గ్రామ సర్పంచ్‌లు సవిలే నీలిమ, సాదే ఆశాజ్యోతి, కరప ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ సరఫరాను పర్యవేక్షించారు.

సీనియర్ సిటిజన్లకు అండగా ట్రిబ్యునల్



సీనియర్ సిటిజన్లకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రామం

కాకినాడ రూరల్: సీనియర్ సిటిజన్ల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి తొలి దశలో కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించేందుకు వీలుగా డివిజన్ స్థాయిలో ప్రత్యేక కౌన్సిలింగ్ కేంద్రం ఏర్పాటైనందున సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాది యనమల రామం పేర్కొన్నారు. బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల మధ్య ఏర్పడిన వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహించేందుకు ట్రిబ్యునల్ ఒక మంచి వేదిక అన్నారు. కుటుంబ సంబంధిత వివాదాలతో పాటు భూమి, సంప్రదాయ సామాజిక సమస్యలు, ఇతర వివాదాలను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ



ఏపీఐఐసీ కాలనీలో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న కోరమాండల్ మహిళా క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రతి రెండో శనివారం నెలకు సరిపడేలా సరుకులను పేద కుటుంబాలకు చెందిన వ్యాధిగ్రస్తులకు అందిస్తున్నామని ఈ సందర్భంగా కోరమాండల్ మహిళా క్లబ్ కోశాధికారి శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్, మల్లీశ్వరి, విజయలక్ష్మి, బాపిరాజు, రాజా తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి బీసీ పోరుబాట

కాకినాడ సిటీ: బీసీ పోరుబాట విజయవంతం చేసేందుకు అన్ని వర్గాలు ఒకే తాటిపైకి రావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రజక, దాసరి, సాధికార కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ కాకినాడ రామారావు పిలుపునిచ్చారు. శనివారం కాకినాడలో జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 18 నుంచి 22 వరకు అన్ని మండల, నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పోరుబాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

కాకినాడ కల్చరల్: స్థానిక శాంతినగర్‌లోని శ్రీరామకృష్ణా సేవా సమితి ఆవరణలో సమితి అధ్యక్షుడు వీఎల్ గాంధీ శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కెఎస్ఎస్ శర్మ, ఉప కార్యదర్శి సతీష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల పర్యటన

కరప: మండలం పెదకొత్తూరు శివారు చినకొత్తూరులో శనివారం జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు పంతం నానాజీ స్థానిక నాయకులతో కలసి జనం కోసం పవన్-పవన్ కోసం మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కర్నాటక ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు

కాకినాడ సిటీ: కర్నాటక ఎన్నికల ఫలితాలు బీజేపీ మతతత్వ విధానాలకు చెంపపెట్టు అని సీపీఎం జిల్లా కమిటీ విమర్శించింది. శనివారం సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ విభజన రాజకీయాలకు, మతతత్వ, రాజ్యాంగ స్ఫూర్తికి భంగం కలిగించే విధానాలను ఆ రాష్ట్ర ప్రజలు తిరస్కరించారన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయం, ప్రత్యేక హోదా విభజన హామీల అమలు కోసం కనీసం మాట్లాడని బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం కోరుతుందని రాజశేఖర్ కోరారు.

స్మార్ట్ సిటీ.. ఇక చకచకా..

- కాకినాడలో ఊపందుకోనున్న ప్రాజెక్టులు
- రూ.136 కోట్ల బకాయిలు విడుదల
- ఆకర్షణీయ నగరంవైపు పరుగులు



నిర్మాణంలో ఉన్న రాగిరెడ్డి కళాక్షేత్రం

కాకినాడ: స్మార్ట్‌సిటీ పథకంలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులు మళ్లీ వేగం పుంజుకోనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఆకర్షణీయ నగరంగా ఎంపికైన కాకినాడ కార్పొరేషన్‌కు ఇప్పటికే సుమారు రూ.వెయ్యి కోట్ల విలువైన అనేక అభివృద్ధి పనులను చేపట్టారు. నగర ప్రతిష్ఠను పెంచేలా, ప్రజలకు ప్రయోజనం కలిగేలా మరికొన్ని ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. అయితే నిధుల కొరతతో కొంత అవాంతరం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం తాజాగా రూ.136 కోట్ల బకాయిలు విడుదల చేయడంతో పనులు మళ్లీ ఊపందుకోనున్నాయి.

వేగవంతం కానున్న పనులు

రూ.38 కోట్లతో ప్రతిపాదించిన నగరపాలక సంస్థ కార్యాలయ భవనం ఆధునీకరణ, రూ.20 కోట్లతో ప్రతిపాదించిన రాగిరెడ్డి కళాక్షేత్రం, రూ.15 కోట్లతో చేపట్టిన సైన్స్ సెంటర్, రూ.18 కోట్లతో కన్వర్టబుల్ స్టేడియం పనులు ఇప్పుడు వేగం పుంజుకోనున్నాయి. ఒకేచోట వివిధ క్రీడలు నిర్వహించేందుకు అత్యధిక వీక్షకులు పట్టేలా నిర్మిస్తున్న కన్వర్టబుల్ స్టేడియం నిర్మాణంలోనూ కదలిక రానుంది. వీటితో పాటు స్మార్ట్ సిటీ పథకంలో ప్రతిపాదించిన మరికొన్ని రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు కూడా రావడంతో నగరంలో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సైతం స్మార్ట్‌సిటీ పనులు వేగవంతం చేసే క్రమంలో నిధుల కోసం నేరుగా ప్రభుత్వ పెద్దలతో ఇటీవల అనేకసార్లు నేరుగా కలిసి చర్చించారు. నగరపాలక సంస్థ కమిషనర్, స్మార్ట్ సిటీ ఎండీ డాక్టర్ మహేష్‌కుమార్ ఇటీవలే పెండింగ్ పనులపై సదరు కాంట్రాక్టర్లతో సమావేశమై పనులను వేగంగా పూర్తి చేయాలని, ఇందుకు అవసరమైన తోడ్పాటును అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో నిధులు విడుదల కావడంతో కాంట్రాక్టర్లు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రభుత్వం నుంచి నిధుల బకాయిలు విడుదలయ్యాయని, త్వరలోనే నగరపాలక సంస్థ కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని సుధాకర ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ వంగ పుల్లారెడ్డి తెలిపారు.

పనులు వేగవంతం చేయండి



స్మార్ట్ సిటీ పథకంలో ప్రతిపాదించిన పెండింగ్ పనులన్నీ కాంట్రాక్టర్లు వేగవంతం చేయాలి. నిర్ణీత గడువు లోపు పనులన్నీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం స్మార్ట్ సిటీ బోర్డు తరఫున అవసరమైన తోడ్పాటు అందిస్తాం. పనులు మాత్రం పూర్తి నాణ్యత ప్రమాణాలతో పారదర్శకంగా, వేగవంతంగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు కూడా పర్యవేక్షించాలి.

– డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, కమిషనర్

లోక్ అదాలత్‌లో 1750 కేసుల పరిష్కారం

కాకినాడ లీగల్: జాతీయలోక్ అదాలత్ ద్వారా 1750 కేసులు పరిష్కారమయ్యాయని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి తెలిపారు. కాకినాడలో శనివారం 9 బెంచ్‌లు ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్, క్రిమినల్, ఇన్సూరెన్స్, ప్రీ లిటిగేషన్, నేరం అంగీకరించి జరిమానా కట్టిన కేసులు పరిష్కారమయ్యాయి.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం, విరాళాలు, దర్శనాలు, కేశ ఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజు సుమారు రూ.3.22 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు.

‘మేరీ లైఫ్-మేరా స్వచ్ఛ షహర్’ సాధిద్దాం



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్

- 10 రోజుల పాటు పాత వస్తువుల సేకరణ
- ఉత్తమ సేకరణకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు
- కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

కాకినాడ: వచ్చేనెల ఐదో తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ‘మేరీ లైఫ్-మేరా స్వచ్ఛ షహర్’ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలకసంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల తెలిపారు. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు పది రోజులపాటు రీ సైక్లింగ్ ప్రక్రియకు ఉపయోగపడే పాత పుస్తకాలు, దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్, ఇతర వస్తువులను పెద్ద ఎత్తున సేకరించనున్నట్లు చెప్పారు. ఈ అంశంపై స్థానిక నగరపాలకసంస్థ కార్యాలయంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థి సంఘాలు, వివిధ శాఖల అధికారులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాత వస్తువుల సేకరణకు నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో కొన్ని కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రజలు, సంస్థలు చైతన్యవంతులై తమ వద్ద నిరుపయోగంగా ఉండి రీసైక్లింగ్‌కు ఉపయోగపడే వస్తువులను ఆయా కేంద్రాల్లో అందజేయాలని సూచించారు. ‘రెడ్యూస్-రీ సైకిల్-రీ యూజ్’ నినాదంతో చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ కోరారు. పది రోజుల పాటు వీటిని సేకరించిన తరువాత జూన్ ఒకటో తేదీ నుంచి 4వ తేదీ వరకు ఆయా కేంద్రాల్లో సేకరించిన వస్తువులు, నిర్వహణ ఆధారంగా మూడు బృందాలను ఎంపిక చేసే ప్రక్రియ చేపడతామన్నారు. ఎంపికైన మూడు బృందాలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. అక్కడ ఎంపికైతే కేంద్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని కమిషనర్ చెప్పారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించినట్టు ఆయన తెలిపారు. ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ పటిష్ట ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఏఏ ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. కాలనీల సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు వైడీ రామారావు, నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డీఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ వెంకట్ రాజు, ఆల్ ఈజ్ వెల్ ప్రతినిధి కిశోర్, వివిధ శాఖల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాలు, సేవా సంస్థల ప్రతినిధులు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు.

పూడికతీతకు పటిష్ట ప్రణాళిక

పటిష్ట ప్రణాళికతో పూడికతీత పనులను వేగవంతం చేయాలని కమిషనర్ మహేష్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ఈ అంశంపై ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాల అధికారులతో సమీక్షించారు. నగరంలో సుమారు 44 కిలోమీటర్ల మేరకు విస్తరించి ఉన్న పెద్ద డ్రైన్లలో పూడిక తీతను పూర్తిస్థాయిలో సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. యంత్రాల ద్వారా అయ్యే పనులతో పాటు కార్మికులను నియమించాల్సినచోట ప్రణాళికా బద్ధంగా పనులు చేపట్టాలన్నారు. ఈ ఏడాది ఎక్కడా వర్షపునీరు నిలువ ఉండకూడదని, ఆ మేరకు పనులు పూర్తికావాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ వెంకటరావు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



పేపకాయలపాలెంలో స్థానిక నాయకులతో కలసి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పేపకాయలపాలెంలో గడప గడపకూ..

కరప: ప్రజా సంక్షేమంతో పాటు, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేయిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా శనివారం కరప శివారు పేపకాయలపాలెంలో ఆయన స్థానిక నాయకులతో పర్యటించి, ఇంటింటికీ వెళ్లి నవరత్నాలతో పాటు, సంక్షేమ పథకాలను వివరిస్తూ, వాటి ద్వారా ఎవరెవరికీ ఎంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ ముందుకు సాగారు. అర్హత ఉండీ పథకాలు మంజూరు కాకపోతే వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. పేపకాయలపాలెం గ్రామంలో చాలా అభివృద్ధి చేశామని, కొన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని, శ్మశానం అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారని, త్వరలోనే వాటిని కూడా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కన్నబాబు హామీ ఇచ్చారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మద్దూరి గంగా భవాని, ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, రొక్కాల గణేష్, సాదే లోహిదాస్ కుమార్, మద్దూరి భాస్కర్, నక్కా సత్తిబాబు, మద్దూరి సత్యనారాయణ, చోడిశెట్టి చంటి, ఇన్‌చార్జి ఎంపీడీఓ గుత్తుల భీమశంకరరావు, గ్రామ కార్యదర్శి వి.సునీల్‌కుమార్, వీఆర్వో టి.రామకృష్ణారెడ్డి, విద్యుత్ శాఖ ఏఈఈ సానా ఈశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువత అభ్యున్నతికే రోటరీ సేవలు



రోటరీ మాసోత్సవాలను ప్రారంభిస్తున్న కాంట్రాక్టర్ ప్రసాద్‌రెడ్డి

బోట్‌క్లబ్: చిన్నతనం నుంచే సేవారంగంపై అభిరుచి కలిగించాలన్న ఉద్దేశంతో అంతర్జాతీయ రోటరీ యువతకు ప్రత్యేక స్థానం కల్పించిందని కాంట్రాక్టర్ బి ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక రోటరీ హాల్‌లో శనివారం రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన మాసోత్సవాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఇంటరాక్ట్, రోటరాక్ట్ క్లబ్‌ల ద్వారా యువతలో సేవాభావం కలిగేలా సేవా కార్యక్రమాలను రూపొందించి రొటేరియన్ల ద్వారా అంతర్జాతీయ రోటరీ అమలు చేస్తోందన్నారు. క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ మాట్లాడుతూ రోటరీ బ్లడ్‌బ్యాంక్‌కు అవసరమైన ప్రత్యేక పరికరాలను దేవి ఫిషరీస్ అధినేత యార్లగడ్డ వీర్రాజు సమకూర్చారన్నారు. క్లబ్ కార్యదర్శి వడ్డాది ఆదిత్య, సభ్యులు ఎస్ శ్రీకాంత్, నరహరిశెట్టి రవికృష్ణ, జీకే శ్రీనివాస్, మాచారెడ్డి, హరిదత్త కుమార్, బళ్ల సత్యపాల్ పాల్గొన్నారు.

రైతే దేశానికి వెన్నెముక

పెద్దాపురం: రైతే దేశానికి వెన్నెముక అని ఉపాధ్యాయిని వాడపల్లి విమలారాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం జై కిసాన్, జైవాన్ అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ ఇక్కడి పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయిని విమలారాణి మాట్లాడుతూ రైతు దేశానికి అమ్మ అయితే, జవాన్ తండ్రి వంటివాడని పేర్కొన్నారు. వారిరువురి సేవలపై విద్యార్థులకు అవగాహన అవసరం అన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు నీతి పద్యాలు, తాత్పర్యాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

పెద్దాపురం: ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి నామవరపు రాజేశ్వరరావు అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో ఆంధ్రా, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఐడీఎస్ఎస్‌సీ 2023కు ఎంపికైన క్యాడెట్ల శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఎన్‌సీసీ కాకినాడ బెటాలియన్ గ్రూపు కమాండర్ కల్నల్ ఏకే రిషి అధ్యక్షతన జరిగిన సదస్సులో జస్టిస్ రాజేశ్వరరావు విద్యార్థికి దృఢ సంకల్పం, ఆత్మ విశ్వాసం, నిబద్ధతతో కూడిన శిక్షణ ఎన్‌సీసీతోనే సాధ్యపడుతుందని అన్నారు. అనంతరం ఏటీసీ 1 కమాండెంట్ కల్నల్ వివేక్ సావన్ గౌడర్ క్యాంపు వివరాలను తెలియజేశారు. విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి, సీఐ అబ్దుల్ నబీ, ఏఎన్‌ఓలు, మిలటరీ సిబ్బంది, 540 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



గొల్లప్రోలులో నీరు నిల్వ ఉండే ప్రదేశంలో పొక్లెయిన్‌తో కచ్చా డ్రెయిన్ తవ్వుతున్న సిబ్బంది

కరప: మండలంలో శనివారం ప్రత్యేక పారిశుధ్య పనులు చురుగ్గా సాగాయి. కరప, యండమూరు, వేములవాడ, వేళంగి, జెడ్.భావారం, గురజనాపల్లి, జి.భావారం, నడకుదురు, కొంగోడు తదితర గ్రామాల్లో ఈ పనులు నిర్వహించారు. డ్రెయిన్లు, కచ్చా డ్రెయిన్లలో పూడికతీయించి, శుభ్రపరచారు. వర్షంనీరు నిల్వ ఉండే ప్రదేశాలు గుర్తించి, నీరుపోయేలా కచ్చా డ్రెయిన్లు తవ్వించారు. ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు ఆయా గ్రామ సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, మార్నెళ్ల శివ, కమిడి మంగాదేవి, సవిలే నీలిమ, కొత్త నాగలక్ష్మి, ఎ.శ్రీనివాసరావు, రొక్కాల గణేష్, దేగల లలితకుమారి, నక్కా బాబులు తదితరులతో కల్సి పారిశుధ్య పనులు పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న అసోసియేషన్ వ్యవస్థాపకులు బంగారు లోవరాజు తదితరులు

కాకినాడ కల్చరల్: రెల్లి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆంధ్రరాష్ట్ర రెల్లి ఉద్యోగుల ఐక్యత అసోసియేషన్ వ్యవస్థాపకుడు బంగారు లోవరాజు అన్నారు. స్థానిక రాగంపేట రెల్లివీధిలోని కమ్యూనిటీ హాలులో అసోసియేషన్ ఆత్మీయ సమావేశం లోవరాజ అధ్యక్షతన శనివారం సాయంత్రం జరిగింది. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపాలిటీ, పంచాయతీలలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న రెల్లి కులస్తులకు సకాలంలో జీతాలు అందడం లేదని లోవరాజు అన్నారు. 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా పదోన్నతులు రావడం లేదని అన్నారు. అసోసియేషన్ నాయకులు జలగడుగుల గణేష్, ఎస్.శ్రీనివాసరావు, గురుమూర్తి, గీసాల చిన్నారావు, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరాన అలజడి



సూర్యారావుపేట బీచ్‌లో ఎగసిపడుతున్న కెరటాలు

కాకినాడ రూరల్: వేసవి తాపంతో ఉపశమనం పొందడానికి, కాస్త విరామానికి నగర ప్రజలు సముద్ర తీరానికి పోటెత్తడం ఈ కాలంలో సర్వసాధారణమైపోయింది. అలలలో కాసేపు ఆడుకుంటూ, ఒడ్డున ఇసుకలో కొంత సేపు కూర్చుని అలల ఒరవడిని, ఉరవడిని వీక్షిస్తూ ఇహం మరచి ఎంతో సేద తీరుతున్నారు. కాగా శనివారం మోచా తుఫాన్ ప్రభావంతో కాకినాడ సముద్ర తీరంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. పెద్ద ఎత్తున కెరటాలు వస్తూ సముద్రం ముందుకు రావడంతో సందర్శకులు కొంత ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన పోలీసులు సాయంత్రం నుంచి సందర్శకులను నిలువరించారు.

ప్రీస్కూల్‌పై ఆసక్తి పెరిగేలా బోధన



అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో సూపర్‌వైజరు, టీచర్లు

సామర్లకోట: ప్రీస్కూల్‌పై చిన్నారుల్లో ఆసక్తి పెరిగేలా అంగన్‌వాడీ టీచర్లు పని చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలా కుమారి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక బ్రౌన్‌పేట గణేష్ కాలనీలో ఐసీడీఎస్ సీడీపీఓ ఉష ఆదేశాల మేరకు సంసిద్ధత ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని, సృజనాత్మకతను పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు శారీరక అభివృద్ధి, బుద్ధి వికాసం, భాషా నైపుణ్యం, సృజనాత్మకత, జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం సకాలంలో అందించాలన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించారు. ప్రథమ్ సూపర్ ట్రైనర్ ఎ.ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.సరోజ, రమణి, మాలతి కుమారి, రత్నం, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెనొప్పితో రైలు ప్రయాణికుడి మృతి

సామర్లకోట: విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న రైలు నుంచి శనివారం దిగిన వ్యక్తి మృతి చెందాడు. రైల్వే స్టేషన్ మేనేజరు కథనం ప్రకారం గుర్తు తెలియని రైలు నుంచి దిగిన రంగారెడ్డి జిల్లా, కుత్బుల్లాపూర్, అయోధ్యనగర్‌కు చెందిన అందులూరి అరుణ్‌కుమార్ (29) గుండె నెప్పితో మూడో నంబరు ప్లాట్‌ఫాంపై దిగాడు. రైల్వే ప్రయాణికులు అతని పరిస్థితిని గమనించి 108కు ఫోన్ చేశారు. విషయం తెలుసుకున్న రైల్వే స్టేషన్ మేనేజరు రైల్వే డాక్టరు జి.సురేంద్రకు సమాచారం ఇచ్చారు. రైల్వే డాక్టరు ప్రాథమిక చికిత్స చేస్తున్న తరుణంలో 108 రావడంతో అతనిని 108లో సామర్లకోట ఆస్పత్రికి తరలించే సమయంలో మార్గం మధ్యలో చనిపోయాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.